సాక్షి
పల్నాడు
బుధవారం । 29 । మార్చి । 2023



గురుకులంలో బడి నిద్ర

సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురం బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో తహసీల్దార్ కె.నగేష్ నేతృత్వంలో మంగళవారం రాత్రి బడి నిద్ర చేపట్టారు.



నిమ్మకాయల ధరలు

తెనాలి టౌన్: స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.5,000 వరకు పలికింది.

కరోనా @ జీరో

గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
నరసరావుపేట	6:27	4:46
గుంటూరు	6:25	4:48
బాపట్ల	6:25	4:48

బాల్యం... దారి తప్పుతోంది

- చెడు వ్యసనాలకు బానిసవుతున్న చిన్నారులు
- పోలీస్ స్టేషన్లకు చేరుతున్న పంచాయితీలు
- మొబైల్, సామాజిక మాధ్యమాలతో చేటు
- పిల్లలపై నిరంతర నిఘా ఉంచాలంటున్న వైద్యులు



'నరసరావుపేట పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని 9వ తరగతి చదువుతోంది. స్కూల్ నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి మగతగా కనిపించింది. తల్లిదండ్రులు భయపడ్డారు. దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. గంజాయి తీసుకున్నట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. ఆరాతీయగా ఆరు నెలలుగా ఇదే పనిలో ఉందని, ఇన్‌స్ట్రాగాంలో పరిచయమైన స్నేహితుడు అలవాటు చేశాడని ఆ అమ్మాయి తెలిపింది'. ఇలా బాల్యంలోనే వ్యసనాలకు బానిసలు కావడం ఆందోళనకు కలిగిస్తోంది.

సాక్షి, నరసరావుపేట: బాల్యం ప్రతి ఒక్కరి జీవితంలో ఓ మధుర జ్ఞాపకం. ఆ వయసులో సరదాలు, సంతోషాలెన్నో ఉంటాయి. ఇదంతా ఒకప్పటి మాట... నేడు ఆధునిక సాంకేతికత విషపు కోరల్లో చిక్కుకుని ఆనంద క్షణాలకు దూరమవుతున్నారు. మంచో చెడో తెలియని వయసులో పెడధోరణుల పాలవుతున్నారు. కోపానికి, కుంగుబాటుకు గురై విపరీత ధోరణలకు పాల్పడుతున్నారు. చిన్న వయసులోనే మద్యానికి, మాదక ద్రవ్యాలకు అలవాటుపడుతున్నారు. చక్కగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాల్సిన వయసులో చెడు అలవాట్లు , పరిచయాలకు గురై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

సెల్ ఫోనే ప్రపంచంగా...

చిన్నారుల చేతిలో సెల్ లేకుండా ఒక్క సెకన్ కూడా గడపని స్థితికి చేరుతున్నారు. ప్రపంచం మొత్తం చిన్న ఫోన్‌లో నిక్షిప్తం అవుతుండటంతో సెల్ చాలా అవసరమవుతోంది. అదే సమయంలో కొన్ని సార్లు అనర్థాలను, అనవసర చిక్కులను తెచ్చిపెడుతోంది. దాన్ని ఎంత మేరకు అవసరమో అంత వరకు ఉపయోగించుకుంటే మంచిదే, కానీ గంటల కొద్ది చాటింగ్‌లు, అనవసర సైట్‌లను చూస్తూ అనర్థాలకు దారితీస్తున్నాయి. అవసరం మేరకే సెల్‌ఫోన్‌లను వాడటం ఎంతో మంచిది.

తల్లిదండ్రుల పాత్రే కీలకం...

పిల్లలను నిరంతరం కట్టడి చేయకూడదు. తమ కనుసన్నల్లోనే ఉండాలని ఆదేశించకూడదు. అలాగని పూర్తిగా స్వేచ్ఛ ఇవ్వటం కూడా తప్పే. అతి గారాభం చేయకూడదు. ఒక్కరిద్దరరే సంతానమనో... లగ్జరీగా పెంచాలన్న ఆలోచనతో విపరీతమైన స్వేచ్ఛనిస్తున్నారు. ఇది వారికి చేటు చేసే అవకాశం ఉంది. నెలకొకసారో, రెండు నెలలకు ఒకసారో విద్యాసంస్థలకు వెళ్లి విద్యార్థుల హాజరు, ప్రగతి, ప్రవర్తన, మాటతీరు పరిశీలించి తగిన పరిష్కారాన్ని వెంటనే కనుగొనాలి. రోజు వారితో కాసేపు ఆత్మీయంగా మనసు విప్పి మాట్లాడాలి. అలస్యంగా ఇంటికి రావడం, అపద్దాలు అడటం, ఇంట్లో చిన్న చిన్న దొంగతనాలు చేయడం, మొండిగా వ్యతిరేకించడం, చీటికిమాటికి చిరాకు పడటం, కోపగించుకోడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు గ్రహించి వెంటనే వారిని మానసిక వైద్యుడితో కౌన్సెలింగ్ ఇప్పించడం ఉత్తమం.

ఇటీవల చోటుచేసుకున్న ఘటనల్లో కొన్ని...

- మాచర్లకు చెందిన ఓ అబ్బాయి ఇంట్లో రూ.22 వేలు దొంగతనం చేసి దొరికిపోయాడు. తల్లిదండ్రులు నిలదీయగా అసలు విషయం బయటపడింది. ప్రస్తుతం జరుగుతున్న ఉమెన్ ఐపీఎల్‌లో తన తల్లి ఫోన్ ద్వారా బెట్టింగ్ యాప్‌లో రూ.50 వేలు పోగొట్టానని, వాటిని తీర్చడానికి మళ్లీ బెట్టింగ్ వేయడం కోసం దొంగతనం చేసినట్లు అంగీకరించాడు.
- గతేడాది గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం పరిధిలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కారణమేంటని పోలీసులు ఆరా తీయగా వాళ్ల నాన్న మొబైల్ ఫోన్ కొనివ్వలేదన్న కోపంతో క్షణికావేశంతో చనిపోయాడని తెలిసింది. సోషల్ మీడియాకు ఆ అబ్బాయి బాగా అలవాటు పడి ఇలా చేసినట్లు సమాచారం.
- పిడుగురాళ్ల మండలంలో ఓ పార్టీకి చెందిన ఫ్లెక్సీని కొన్ని రోజుల క్రితం ఆరో తరగతి విద్యార్థి బ్లేడ్‌తో కోయడంతో పెద్ద వివాదమైంది. ఆ పార్టీ నాయకుల ఫిర్యాదుతో ఆ బాలుడిని పోలీసులు విచారించారు. మందలించిన టీచర్‌ను బెదిరించడానికి తన చేతిని బ్లేడ్‌తో కోసుకోవాలని విద్యార్థి అనుకున్నట్లు చెప్పాడు. ఆ రోజు టీచర్ బడికి రాకపోవడంతో ఆ కోపాన్ని తీర్చుకునే ప్రయత్నంలో ఆ పార్టీ ఫ్లెక్సీని కోసినట్లు అంగీకరించాడు.

పిల్లలను ఓ కంట కనిపెట్టాలి...



తల్లిదండ్రులు పిల్లలను ఓ కంట కనిపెడుతుండాలి. వారి అలవాట్లు, ప్రవర్తన, మాట తీరు వంటివి గమనిస్తుండాలి. అవసరమైనప్పుడు అలస్యం చేయకుండా మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించడం చాలా అవసరం. చెడు స్నేహాల వలన పిల్లలు వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదముంది. తల్లిదండ్రులు పిల్లలకు తగిన సమయం కేటాయించడం ద్వారా చాలా వరకు సమస్యను పరిష్కరించవచ్చు.
– డాక్టర్ వీవీ కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, మానసిక విభాగం, గుంటూరు జీజీహెచ్



కలెక్టర్ క్రికెట్ ట్రోఫీ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా అధికారులు

ఉద్యోగుల క్రీడలు ప్రారంభం

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించకుని ప్రభుత్వ ఉద్యోగుల క్రీడలు ప్రారంభమయ్యాయి. మంగళవారం నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు పోటీలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్స్ క్రికెట్ ట్రోఫీకి వాల్‌పోస్టర్‌ను ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. వివిధ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే అధికారుల పేర్లను ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరఫున క్రికెట్ టోర్నీకి డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, యువత నుంచి చీఫ్ కోచ్ శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మధ్య నిర్వహించే షటిల్ బ్యాడ్మింటన్‌కు డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, చెస్‌కు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కన్వీనర్ డాక్టర్ పి.సునీల, త్రో బాల్‌కి సివిల్ సప్లయిస్ డీఎం జి.వరలక్ష్మి, క్విజ్ కాంపిటీషన్‌కు జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, మ్యూజిక్ విభాగానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ.మురళి, పాటల కాంపిటీషన్‌కు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి పి.ఓబుల్ నాయుడు, ఫన్ గేమ్స్‌కు జిల్లా సెరికల్చర్ ఆఫీసర్ పి.రాధారాణి ప్రాతినిధ్యం వహించనున్నారు. వివిధ అంశాలలో ప్రభుత్వ ఉద్యోగుల మధ్య క్రీడల పోటీలు ప్రారంభమయ్యాయి.

సుస్థిర అభివృద్ధిలో భాగస్వాములు కండి

పల్నాడు జిల్లాలో సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో జిల్లా మహిళా అభివృద్ధి– శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా జిల్లాలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు సరైన పౌష్టికాహారం అందించడం ద్వారా మెరుగైన సమాజం తయారు చేయవచ్చని పేర్కొన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పగడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. పిల్లల్లో వయసుకు తగ్గ ఎత్తు, బరువు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారికి బలమైన ఆహారం అందించడంతో పాటుగా వ్యాయామం తప్పని సరిగా చేయించాలని చెప్పారు. జిల్లాలో గర్భిణులు, బాలింతలు, వారిలో రక్తహీనత ఇబ్బందులు పడుతున్న వారు ఎంత మంది ఉన్నారు? వారికి నిబంధనల మేరకు అందిస్తున్న పౌష్టికాహారం, వారి ఆరోగ్య పరిసస్థితులు వంటి అంశాలపై క్షేత్ర స్థాయిలో వివరాలను సేకరించాలని కోరారు. జిల్లాలో 65 శాతం మందే పౌష్టికాహారం స్వీకరిస్తున్నారని మిగతా వారికి బలవర్ధక ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు తప్పని సరిగా వారానికి ఒక్కసారి కౌన్సెలింగ్ ఇచ్చి బలవర్థక ఆహారం ఇచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా అభివృద్ధి – శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గోగులమ్మను తాకిన సూర్య కిరణాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువు తీరిన గోగులమ్మ అమ్మవారిని మంగళవారం సూర్యనారాయణ స్వామి వారి కిరణాలు తాకాయి. ఉదయం 7:13 గంటల నుంచి పావు గంటపాటు ఈ కిరణాలు అమ్మవారిని తాకినట్లు అర్చకులు దీవి గోపాలకృష్ణమాచార్యులు తెలిపారు. ప్రతి ఏటా నాలుగైదు సార్లు సూర్య కిరణాలు అమ్మవారిని ఇలా తాకుతాయని ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జూనియర్ అసిస్టెంట్(2), జూనియర్ స్టెనో(1), టైపిస్ట్(3), స్టోర్ కీపర్(1), ఆఫీస్ సబార్డినేట్(8), మేసేంజర్(2), ల్యాబ్ అసిస్టెంట్(1), ల్యాబ్ అటెండర్(1), వర్క్ షాప్ అటెండర్(1), స్కిల్డ్ వర్క్ మ్యాన్(1), ఫిషర్ మ్యాన్(1), శానిటరీ మేస్త్రీ(1), వాచ్‌మాన్(9), వాటర్ మ్యాన్(1), స్వీపర్(3), పబ్లిక్ హెల్త్ వర్కర్(12), గ్యాంగ్ మజ్దూర్(2), డ్రెయిన్ క్లీనర్(1), కళాసీ(1), హోల్ టైమ్ సర్వెంట్(1), లస్కర్(1) చొప్పున మొత్తం 54 ఖాళీలు ఉన్నాయి. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్ https://www.gunturap.in/2023.

జుమ్మా మసీదు @150

అప్పట్లో గుంటూరు తర్వాత భట్టిప్రోలులోనే మసీదు



భట్టిప్రోలు: భట్టిప్రోలు ప్రధాన రహదారిలోని జుమ్మా మసీదుకు 150 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో జమాలుద్దీన్ ఈ మసీదును నిర్మించారు. ఆ కాలంలో జిల్లాలో గుంటూరు తర్వాత భట్టిప్రోలులోనే మసీదు ఉండేది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముస్లింలు నమాజు చేసుకునేందుకు ఇక్కడకు గుర్రాలపై వచ్చేవారని పెద్దలు చెబుతుంటారు. నమాజుకు వచ్చిన వారికి భోజన వసతి కూడా ఏర్పాటు చేసేవారని చెబుతున్నారు. జుమ్మా మసీదుకు ఎదురుగా ఉన్న గదులు ప్రార్థన చేసేందుకు వచ్చేవారు విశ్రాంతి తీసుకునేందుకు ఉపయోగించేవారు. గుర్రాలు నిలుపుదల చేసేందుకు ఈ భవనం కిందగా దారి ఉండేది. ఇప్పుడు అక్కడ దుకాణాలు వెలిశాయి. ఈ మసీదు ఏర్పడ్డాకే జిల్లాలోని అన్ని ప్రాంతాలలో మసీదులు ఏర్పాటు చేసినట్లు చెబుతారు. అప్పటి నుంచి ఐదు పూటలా నమాజులు, ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలతో పాటు తరాబే నమాజులు జరుగుతాయి.

మిర్చి యార్డుకు 1,21,132 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు మంగళవారం 1,21,132 బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,15,421 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 87,722 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.





పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలను ప్రపంచ బ్యాంకు (ఇండియా) డైరెక్టర్ అగస్టే తనో కౌమే బృందం మంగళవారం సందర్శించింది. విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీతో సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు అద్భుతమని కొనియాడింది. వరల్డ్ బ్యాంకు తగిన విధంగా సాయం అందిస్తుందని హామీ ఇచ్చింది. వీరి వెంట పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు. – పెదకాకాని



విశాఖ వేదికగా ప్రారంభమైన జి-20 సదస్సుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగళవారం రాత్రి అక్కడి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

సరైన దిశ.. మార్చే దశ

'సాక్షి', కేఎల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ ఎ.శ్రీకాంత్



సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు

నిర్వహణ, నైపుణ్యాలకు అపార అవకాశాలు

తెనాలి: సాంకేతిక నైపుణ్యాలతోపాటు నిర్వహణ(మేనేజ్‌మెంట్) నైపుణ్యాలు చాలా అవసరమని కేఎల్ యూనివర్సిటీ బిజినెస్ అనలటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ ఎ.శ్రీకాంత్ అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో 'సాక్షి' గ్రూపు, కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'బిజినెస్ అనలటిక్స్ అండ్ ఈ–కామర్స్ టెక్నాలజీస్' అనే అంశంపై సదస్సు మంగళవారం నిర్వహించారు. సదస్సుకు ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. బీసీఏ, బీకాం (కంప్యూటర్స్) విద్యార్థుల నుద్దేశించి డాక్టర్ ఎ.శ్రీకాంత్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి వివిధ వయసులు కలిగిన వ్యక్తులతో చాకచక్యంగా పనిచేయించుకోవటమే మేనేజ్‌మెంట్‌గా చెప్పారు. ఈ నైపుణ్యం తెలిసినపుడు అవకాశాలకు ఆకాశమే హద్దని స్పష్టంచేశారు. ఇప్పుడున్న ప్రపంచంలో అనలటికల్ స్కిల్స్ ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయని వివిధ రకాల కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ఔట్‌లెట్లను తెరచి చేస్తున్న వ్యాపారాల ఫలితంగా బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఓ కంపెనీ నెలనెలా చేస్తున్న కోట్లాది లావాదేవీల డేటాను అనలైజ్ చేయటం గొప్ప టాస్క్‌గా చెప్పారు. ఫలితంగానే 'మార్కెట్ బాస్కెట్ అనాలసిస్' కీలకమైందని తెలిపారు.

అనలటికల్ స్కిల్స్ కీలకపాత్ర..

ఆ క్రమంలోనే అనలటికల్ స్కిల్స్ కీలకపాత్ర వహిస్తున్నాయని డాక్టర్ ఎ.శ్రీకాంత్ తెలిపారు. వీటిలోనే డేటా అనలిస్ట్, డేటా సైంటిస్ట్, మిషీన్ లాంగ్వేజ్ వంటివి ఉన్నాయన్నారు. మేథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ నాలెడ్జి కలిగిన విద్యార్థులకు ఈ రంగంలో బ్రహ్మాండమైన అవకాశాలు వస్తాయన్నారు. అనలటిక్స్‌లో కాంపిటేటివ్, క్వాలిటేటివ్ డేటా విజువలైజేషన్ వంటి మూడు విభాగాలు ఉంటాయని చెప్పారు. ఈ నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులకు అమెజాన్, కేపీఎంజీ, నీల్సన్, గాట్నర్ వంటి కంపెనీల్లో ఉపాధిని అవకాశాలు ఉన్నట్లు వివరించారు. వీటిలో ఉద్యోగం రూ.8–12 లక్షల ప్యాకేజీతో మొదలవుతుందని తెలిపారు. ఏడాది అనుభవానికి రూ.15 లక్షల ప్యాకేజీ, రెండేళ్ల అనుభవముంటే రూ.20 లక్షల చొప్పున వేతనం భారీగా పెరుగుతూ ఉంటుందని వివరించారు. మంచి అవకాశాల కోసం ఐబీఎం, మైక్రోసాఫ్ట్, సేల్స్ ఫోర్స్, కేపీజీఎం వంటి సంస్థలు సర్టిఫికేషన్ ఇస్తున్నాయని వెల్లడించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చారు. అనంతరం కేఎల్ యూనివర్సిటీ తరఫున ఏఎస్ఎన్ డిగ్రీ విద్యార్థుల్లో అకడమిక్ ప్రతిభావంతులైన షేక్ జఫ్రీన్, వాసుదేవ, మణికంఠ, ఎస్.లికిత, ఎం.మెగసారికలకు డాక్టర్ ఎ.శ్రీకాంత్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కేఎల్‌యూ రీజనల్ మేనేజర్లు టి.నారాయణ, జి.నాగరాజు పాల్గొన్నారు.

మోటివేషన్ స్పీచ్ బాగుంది



డాక్టర్ శ్రీకాంత్ మోటివేషన్ స్పీచ్ చాలా బాగుంది. ఏ మార్గంలో ముందుకెళితే మంచి అవకాశాలను అందుకోవచ్చనే అంశంపై ఒక అవగాహన వచ్చింది. బిజినెల్ అనలిటిక్స్ ప్రత్యేకత, వాటిలోని ఆఫర్లను ఆసక్తి కలిగించేలా వివరించారు.
– విజయమోహన్, బీసీఏ విద్యార్థి

డేటా అనలిసిస్ట్ కీలకమని తెలిసింది



నేటి సమాజంలో ఈ–కామర్స్ ప్రాధాన్యం పెరుగుతున్న విధానం, అందులో డేటా అనలిసిస్ట్ కీలకమైన్న అంశాలు చాలా బాగా అర్థమయ్యాయి. ఐటీలోనే కాకుండా మేనేజ్‌మెంట్‌లోనూ అపార అవకాశాలపై విహంగ వీక్షణంలా చెప్పిన తీరు బాగుంది.
– రవలిక, బీసీఏ విద్యార్థిని

ఇన్ని అవకాశాలున్నాయా....!



బిజినెస్ అనలటిక్స్‌లో ఇన్ని అవకాశాలు ఉన్నాయని ఇప్పుడే తెలిసింది. ఈ–కామర్స్ విస్తరిస్తున్న తీరు, వెల్లువెత్తుతున్న ఉపాధి రంగం చాలా ఆశలను రేకెత్తిస్తోంది. ఇన్ని విషయాలు తెలుసుకుంటామని అనుకోలేదు. జీవితంలో చాలా ఉపయోగం
– తేజస్వి, బీసీఏ విద్యార్థిని

ఎంపీహెచ్‌ఏ ఫీమేల్‌కు కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్‌కు మంగళవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పునర్విభజన కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 91 మంది ఎంపీహెచ్‌ఏ అభ్యర్థులు హాజరు కాగా, 82 మందికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఇంటర్'వెల్



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు మంగళవారం ముగిశాయి. కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ పేపర్–1 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 50,053 మంది విద్యార్థుల్లో 48,619 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీవీఈఓ జె.పద్మ గుంటూరులోని విద్వాన్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం తనిఖీకి వెళ్లిన సమయంలో కాపీయింగ్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని గుర్తించి, మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేయించారు. 68 పరీక్ష కేంద్రాల్లో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

ఇంధన పొదుపు డ్రైవర్లకు సన్మానం


సన్మానం పొందిన ఆర్టీసీ డ్రైవర్లతో అధికారులు, యూనియన్ నాయకులు

నరసరావుపేట: జిల్లా స్థాయిలో ఇంధన పొదుపు శిక్షణ కార్యక్రమంలో అత్యధిక ఇంధనం పొదుపు చేసిన ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లను అధికారులు ఘనంగా సన్మానించారు. మంగళవారం డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్.శ్రీనివాసరావు, నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల డిపో మేనేజర్లు బత్తుల వీరాస్వామి, రాంబాబు, పిచ్చయ్య హాజరై డ్రైవర్లు జె.ఆంజనేయులు, టీఎస్ రావు, కేకే రావును ఘనంగా సన్మానించారు. యూనియన్ నాయకులు జీటీ రావు, ఎంవీ రెడ్డి, కేఎస్ రావు పాల్గొన్నారు.

హెవీ మోటారు డ్రైవింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి..

డిపో ఆవరణలో నిర్వహించే హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు డ్రైవింగ్ స్కూల్ ద్వారా 11 బ్యాచ్‌లు శిక్షణ పూర్తిచేశాయన్నారు. 12వ బ్యాచ్‌కు ప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. శిక్షణ పొందగోరు డ్రైవర్లు 99592 25428, 73828 96038 నంబర్లలో సంప్రదించాలన్నారు. సీట్లు పరిమితమని, ఒక్కొక్క బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉందన్నారు.

175 స్థానాల్లో గెలుపు ఖాయం

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



మాచవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు అవసరమైన సంక్షేమ పాలన అందించిందని, పేదల పక్షపాత ప్రభుత్వం కాబట్టే వచ్చే 2024 ఎన్నికల్లో 175 సీట్లు తప్పకుండా గెలుస్తామనే దృఢ విశ్వాసం ఉందని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. వేమవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన శానంపూడి అరుణకుమారి, పెరుగు సాంబయ్య కుటుంబాలను పరామర్శించారు. మాచవరంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు టీడీపీ గెలుచుకోవడంతో వైఎస్సార్ సీపీకి ఎదురుగాలి తగిలిందని దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి, ప్రలోభాలతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు గెలుచుకున్న టీడీపీ విమర్శలు చేయడం అవివేకమన్నారు. ఎక్కడా వైఎస్సార్ సీపీ ఓటింగ్ శాతం తగ్గలేదన్నారు. రాష్ట్రంలో 85 శాతం ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాడు టీడీపీ, మహిళలను అన్ని రంగాల్లో మోసం చేసిందని, డ్వాక్రా రుణమాఫీ పేరుతో నయవంచనకు పాల్పడిందన్నారు. నేడు ప్రతి పథకానికి సంబంధించిన నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడంతో అవినీతి, అక్రమాలకు తావులేదని చెప్పారు. దీంతో ప్రజలకు ప్రభుత్వంపై విశ్వసనీయత ఏర్పడిందన్నారు. నాడు కేవలం కొన్ని వర్గాలకు మాత్రమే కార్పొరేషన్ల ద్వారా లబ్ధి చేకూరేదని, కానీ నేడు అన్ని వర్గాల ప్రజలు జగనన్న పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. రాజకీయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉన్నత పదవులు, మంత్రి పదవుల్లో సామాజిక న్యాయం చేస్తూ అన్ని వర్గాలకు అవకాశాలు కల్పించినట్లు గుర్తుచేశారు. గురజాల నియోజకవర్గంలో మార్కెట్ యార్డు పదవులు ఎస్సీ, బీసీ, మైనార్టీలకు కేటాయించినట్లు తెలిపారు. అట్టడుగు వర్గాలను ఆదుకోవడం కోసం, రాష్ట్రంలో ఆర్థిక సమానత్వం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాదీవెనతో రాబోయే ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ జె.శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, గ్రామ సర్పంచ్ రాగిడి నరేష్, పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, కౌన్సిలర్ షరీఫ్, ఎంపీటీసీ మద్దు అనురాధ కృష్ణాంజనేయులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయస్థాయి పశు బలప్రదర్శన పోటీలు

అచ్చంపేట: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వేల్పూరులో జరుగుతున్న జాతీయ స్థాయి పశు బలప్రదర్శన బండలాగుడు పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కృష్ణా జిల్లా, కానూరు మండలం, పెనమలూరుకు చెందిన దేవభక్తుని సుబ్బారావు ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానాన్ని గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లికి చెందిన పులగం అశ్వితారెడ్డి ఎడ్ల జతకు, మూడవ స్థానం గుంటూరు జిల్లా, చుండూరు మండలం, వేటపాలానికి చెందిన ఆర్కే బుల్స్, 4వ స్థానం పిడుగురాళ్ల మండలం, బ్రాహ్మణపల్లికి చెందిన దుప్పిలి అంజిరెడ్డి జతకు, 5వ బహుమతి బాపట్ల మండలం, బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి జతకు, 6వ బహుమతి గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన అవుతు అర్థవర్ధన్‌రెడ్డి జతకు, 7వ బహుమతి బాపట్ల మండలం బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి జతకు, 8వ బహుమతి పల్నాడు జిల్లా మాచవరానికి చెందిన ముక్కపాటి రామారావు చౌదరి ఎడ్ల జతకు లభించాయి. పోటీలో మొత్తం 15 జతలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చీరాల వాడరేవు హైవేపై రైతుల అభ్యంతరాల స్వీకరణ

రైతులతో సమావేశం నిర్వహించిన జిల్లా జాయింట్ కలెక్టర్



కార్యాలయం బయట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నరసరావుపేట: చీరాల వాడరేవు హైవేపై రైతుల అభిప్రాయం తీసుకునేందుకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ, హైవే అధికారులు సమావేశం నిర్వహించారు. హైవే కోసం చేసిన నోటిఫికేషన్‌పై రైతుల అభ్యంతరాలను స్వీకరించేందుకు సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన కేసానుపల్లి, ఇసప్పాలెం, జొన్నలగడ్డ, గుంటగార్లపాడు, రావిపాడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి అభ్యంతరాలను నమోదు చేశారు. వీటిని పై అధికారులకు పంపిస్తామని తెలిపారు. హాజరైన రైతులు అధికారుల ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. గతేడాది తొమ్మిదో నెలలోనే తామందరమూ అభ్యంతరాలు తెలియచేయగా ఇప్పటివరకు వాటికి సమాధానాలు ఇవ్వలేదన్నారు. దీంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే, హైవే అధికారులతో సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు సమావేశం నిర్వహించలేదన్నారు. దీనిపై నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పురపాలక పరిధిలోని భూముల్లో గుండా కాకుండా మండల పరిధిలోని పొలాలను రహదారి నిర్మాణంకోసం ఇచ్చేందుకు తమకు అభ్యంతరంలేదన్నారు. ప్రస్తుతం పురపాలక పరిధిలో విపరీతంగా భూముల రేట్లు పెరిగినందున అవి తీసుకొని ప్రభుత్వం ఇస్తానంటున్న ధరలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. అందువలన తామంతా తమ భూములను ఇచ్చేందుకు వ్యతిరేకిస్తున్నామని అధికారులకు తెలియచెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ ఆర్‌వీ రమణా నాయక్ సమావేశానికి హాజరుకాగా రైతు సంఘ నాయకులు ఏపూరి గోపాలరావు, కామినేని రామారావు, పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు రైతులకు మద్దతు పలికారు.

దేవస్థాన అభివృద్ధికి సహకరిస్తాం

అద్దంకి రూరల్: అద్దంకిలో కాళికామాత సమేత కమతేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధికి దేవదాయ శాఖ తరుపున సహకారం అందిస్తామని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్ కోటిరెడ్డి అన్నారు. దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట జరిగి 40 రోజులు అయిన సందర్భంగా మంగళవారం ప్రత్యేక మండల పూజ, యజ్ఞం నిర్వహించారు. ఈవో కోటిరెడ్డి పూజల్లో పాల్గొని దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. దేవస్థానానికి ఎటువంటి ఆదాయం లేకపోయినా అభివృద్ధి పనులు చేపడుతున్న కమిటీ చైర్మన్ అనంతు మురళీమోహన్‌రావు, అతని మిత్రులను అభినందించారు. ఈఓని దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పొన్నపల్లి బ్రహ్మానందం, చెన్నుపల్లి శ్రీనివాసచారి, పొన్నపల్లి మల్లికార్జున, మునగంటి నరసింహాచారి, వీర సుందరాచారి, బొప్పుడి వీరప్పయాచారి, శర్మ, లక్కరాజు భుజంగరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

పట్టణంలో భారీ వర్షం


పట్టణంలో కురుస్తున్న భారీ వర్షం

మాచర్ల: పట్టణంలో మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో కుండపోత వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఎటు చూసినా వర్షపు నీటితో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. పట్టణంలో రెండున్నర గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పట్టణ పరిసర ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు.

చెక్ బౌన్స్ కేసులో టీచర్‌కు ఏడాది జైలు శిక్ష

సత్తెనపల్లి: చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడికి ఏడాది జైలు శిక్ష, రూ.4 లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన కూరాకుల పున్నయ్య వద్ద 2015 అక్టోబర్ 10న కుటుంబ అవసరాల నిమిత్తం నూజెండ్ల మండలం రవ్వవరం ఎంపీయుపీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పమిడిమళ్ల ఏసుబాబు రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. పున్నయ్య తిరిగి నగదు ఇవ్వాలని కోరగా, దీని నిమిత్తం 2017 జనవరి 27న రూ.4 లక్షలకు ఏసుబాబు చెక్ ఇచ్చాడు. ఆ చెక్కును కూరాకుల పున్నయ్య తన బ్యాంకు ఖాతాలో వేయగా ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. నేరం రుజువు కావడంతో ఎన్ఐ యాక్ట్ కింద న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

భర్త దాడితో భార్య మృతి

దుర్గి: మించాలపాడు గ్రామంలో భార్యాభర్తల మధ్య వివాదంలో భార్య మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన ఎర్రగోల వెంకటరావమ్మ (50) మృతి చెందింది. భర్త హనుమయ్య మృతురాలు వెంకటరావమ్మ మధ్య ఘర్షణ జరిగింది. క్షణికావేశంలో హనుమయ్య గాయపరచడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. వీరికి ఐదుగురు సంతానం. కుమారులు అందరూ వివాహాలు చేసుకుని ఎవరికి వారే విడివిడిగా జీవిస్తున్నారు. మృతురాలి స్వస్థలం గురజాల మండలం అంబాపురం. కుటుంబ సభ్యులు, మృతురాలి తమ్ముడు జిలుగు వీరయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఇద్దరికి స్వల్ప గాయాలు

దుర్గి: ఓబులేశునిపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని చెట్టుపై పిడుగు పడింది. ఈ సంఘటనలో పత్తిపాటి రామయ్య, దాచేపల్లికి చెందిన మెకానిక్ మహమ్మద్ హుస్సేన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్పృహ తప్పడంతో స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వర్షానికి గ్రామాల్లో కల్లాల్లో ఉన్న మిర్చి, మొక్కజొన్న, కంది పంటలను రక్షించుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వేసవిలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలి


మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కారం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి గ్రామాలను గుర్తించి సమస్యలు పరిష్కారం చేయాలని ఆదేశించారు. వేమూరు నియోజకవర్గంలో సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందని, అధికారులు శ్రద్ధ వహించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. చుండూరు మండలం ఆలపాడు గ్రామానికి రూ.50 లక్షలు, పెనుగుద్రపాడు గ్రామానికి రూ.25 లక్షలు, అమర్తలూరు మండలం పాంచాళవరం గ్రామానికి రూ.50 లక్షలు, యలవర్రు గ్రామానికి రూ.50 లక్షలు, పెదపూడి గ్రామానికి రూ.75 లక్షలు, మూల్పూరు గ్రామానికి రూ.50 లక్షలు, బోడపాడు గ్రామానికి రూ.50 లక్షలు, తురుమెళ్లకు రూ.50 లక్షలు, వేమూరు మండలం వరహాపురం గ్రామానికి రూ.50 లక్షలు, వెల్లబాడు గ్రామానికి రూ.25 లక్షలు, పోతుమర్రు గ్రామానికి రూ.50 లక్షలు, పెనుమర్రు గ్రామానికి రూ.25 లక్షలు, కొల్లూరు మండలం దోనేపూడి గ్రామానికి రూ.75 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అధికారులు వెంటనే పనులు ప్రారంభించి, వేసవి కాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల ఎస్ఈ సీహెచ్ విద్యాసాగర్, డీఈ జేబీ సురేష్, ఏఈలు పినపాటి జడ్సన్‌పాల్, లంక జాన్‌ప్రదీప్, రసూల్, ఏసయ్య, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

బల్లికురవ: మద్యం మత్తు, ఎండతాపానికి గురై రోడ్డు మార్జిన్‌లోనే పడిపోయి ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం మండలంలోని కొత్తమల్లాయపాలెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వీ వేమన తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ (35) ఇక్కడ క్వారీల్లో పనిచేస్తున్నాడు. సంతమాగులూరుకు చెందిన కాంట్రాక్టర్ సత్యం ద్వారా ఈ ప్రాంతానికి వచ్చాడు. అయితే లక్ష్మీనారాయణ మద్యానికి బానిస కావడంతో ఏ క్వారీలోనూ సక్రమంగా పనిచేయలేకపోయాడు. దీంతో క్వారీల నిర్వాహకులు పనిలో పెట్టుకోలేదు. ఈ క్రమంలో కొత్తమల్లాయపాలెం నుంచి క్వారీలకు వెళ్లే రోడ్డులోని మార్జిన్‌లో పూటుగా మద్యం సేవించి పడిపోయి ఉండటంతో స్థానికులు ఎస్ఐకి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వచ్చి ఎస్ఐ పరిశీలించగా అతను మృతి చెందినట్లు తెలుసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భర్త ఇంటిముందు భార్య ఆందోళన

చీరాల: తన భర్త తనకు కావాలి.. న్యాయం చేయాలంటూ వివాహిత భర్త ఇంటిముందు ఆందోళనకు దిగింది. ఈఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని హారీస్‌పేటలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. హారీస్‌పేటకు చెందిన లేళ్ల చైతన్యకు రాజ్యలక్ష్మితో కొంతకాలం కిందట వివాహం జరిగింది. అయితే గత కొన్ని రోజుల నుంచి తన భర్త చైతన్య తనను వేధించడంతోపాటు అత్తమామల మాటలకు ఒత్తాసు పలుకుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయింది. అత్తమామల ఆదేశాలతో భర్త తనను ఇంట్లోకి రానివ్వకుండా వేధిస్తుండటంతో గత్యంతరం లేక తన భర్త ఇంటి ముందు ఆందోళన చేస్తున్నానని తెలిపింది. తనకు న్యాయం చేసేంత వరకు ఆందోళన విరమించనని ఇంటి ముందు భీష్మించుకుని కూర్చుంది. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ పోలీసులు ఆందోళన చేస్తున్న వివాహిత, ఇరువర్గాల కుటుంబ సభ్యులతో సంప్రదింపులు చేస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వడ్డీ రాయితీతో తొలగిన ఆస్తి పన్ను వివాదం

- రూ.1.66 కోట్లు చెల్లించిన ఎస్ఎస్ఎన్ కళాశాల యాజమాన్యం
- రూ.4 కోట్ల వడ్డీ రాయితీ


మున్సిపల్ అధికారులకు పన్ను నగదు అందజేస్తున్న సుబ్బరాయగుప్తా

నరసరావుపేట: ఆస్తి పన్ను చెల్లింపులో పురపాలక సంఘానికి ఎస్ఎస్ఎన్ కళాశాల యాజమాన్యం మధ్య నెలకొన్న వివాదం ముగిసింది. కొన్నేళ్లుగా ఆస్తి పన్నుపై ఉన్న వివాదం కోర్టు వరకు చేరి చివరకు ప్రభుత్వం కల్పించిన పన్ను రాయితీతో సద్దుమణిగింది. ప్రభుత్వం కల్పించిన రాయితీతో చెల్లించాల్సిన రూ.5.67 కోట్ల పన్నులో యాజమాన్యానికి రూ.4 కోట్ల రిలీఫ్ దక్కింది. మున్సిపల్ మాజీ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా వారి కళాశాల భవనాలకు సంబంధించి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలను వడ్డీ రాయితీతో మొత్తం రూ.1.66 కోట్లు చెల్లింపులను పూర్తిచేశారు. మంగళవారం మెయిన్ రోడ్డులోని తన జ్యూయలరీ షాపులో నగదును మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు సమక్షంలో రెవెన్యూ సిబ్బందికి చెల్లించి తగిన రసీదు పొందారు. ఈ నెల 21వ తేదీ రూ.1.06 కోట్లు చెల్లించగా, మిగిలిన ఐదు అసెస్మెంట్‌లకు సంబంధించిన రూ.60.75 లక్షలు నగదు రూపంలో చెల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం రోజున వడ్డీ మాఫీతో పన్ను చెల్లించేందుకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, మొబైల్ కౌంటర్లు పని చేస్తాయన్నారు. సచివాలయ అడ్మిన్లు, సెక్రటరీలు అందరూ విధులకు హాజరై పన్ను వసూలులో పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీ కేవలం మూడు రోజులు మాత్రమే ఉందని, ఈ అవకాశాన్ని పన్ను చెల్లించవలసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, వార్డ్ అడ్మిన్ సెక్రటరీ కవిత పాల్గొన్నారు.

ప్రత్యేకమైంది.. నారాయణాచార్యుల సాహిత్యం


నివాళులు అర్పిస్తున్న వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ రెడ్డి

గుంటూరు రూరల్: తెలుగు కవులలో పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యుల సాహిత్యం ప్రత్యేకమైందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పుట్టపర్తి నారాయణాచార్యుల 108వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. వీసీ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో అగ్రగణ్యుడు, బహుభాషాకోవిదుడని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.విజయాభినందన, సామాజిక విజ్ఞాన శాస్త్రం పీఠాధిపతి డాక్టర్ సీహెచ్ చిరంజీవి, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.సుధాకర్, కంట్రోలర్ ఎ.వి.రమణ పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

స్టెప్ సీఈఓ పల్లవి


సదస్సులో పాల్గొన్న స్టెప్ సీఈఓ పల్లవి తదితరులు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల స్థాయి నుంచి విద్య, ఆరోగ్యంపై అవగాహన కలిగిఉండాలని స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి తెలిపారు. బరంపేటలోని కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఈఓ పల్లవి మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులుగా గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. చదువుతో పాటు ఆటల పట్ల కూడా మక్కువ పెంచుకోవాలని తెలిపారు. విద్య, లలిత కళలు, క్రీడల్లో రాణించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.ఇశ్రాయేల్‌ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.తావుర్యా, ఎడ్యుకేట్ ద సొసైటీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అన్సారీ, స్టెప్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంపోస్ట్ ఎరువుతో ఆరోగ్యకర పంటలు

వర్మీకంపోస్ట్ కేంద్రం లైసెన్స్‌లు పంపిణీ


రైతులకు వర్మీకంపోస్ట్ ఎరువుల యూనిట్లను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: వానపాముల ఎరువులు, కంపోస్ట్ ఎరువులతో భూమి ఆరోగ్యాన్ని కాపాడి ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.వెంకటనాయుడు తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వర్మీకం పోస్టు ఎరువుల యూనిట్, వానపాముల ఎరువుల తయారీ కేంద్రం లైసెన్స్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్మీకంపోస్టు ఎరువులు, వానపాముల తయారీ యూనిట్లను తక్కువ స్థలంలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రెండు నెలల సమయంలో ఎరువులను తయారు చేసుకోవచ్చని దీని ద్వారా నెలకు రూ.20 వేలు సంపాదించవచ్చన్నారు. అనంతరం 30 మంది ఎంపికైన రైతులకు యూనిట్లను పంపిణీ చేశారు. లైసెన్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.వి.కె. ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.వి.సుబ్రమణ్యం, అగ్రానమి శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి, డాక్టర్ కె.జె.రాజన్, కె శేఖర్‌రెడ్డి, ఎస్.మదన్‌మోహన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సిద్ధం

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రాజారెడ్డి


జెండా ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్ : ఉద్యోగుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రాజారెడ్డి అన్నారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ 12వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈవేడుకలకు రాజారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి యూనియన్ జెండా ఆవిష్కరించారు. యూనియన్ మెడికల్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకముందు ఉద్యోగులు 3,97,128 మంది ఉంటే, నాలుగేళ్లలో 6,16,000 మంది రెట్టింపు సంఖ్యలో ప్రభుత్వం ఉద్యోగులను నియమించిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఆవుల సుందరరామిరెడ్డి, రూబెన్, జీజీహెచ్ అధ్యక్షుడు యోహాను, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, రాధరాణి, జ్యోతి, సంతోష్ పాల్గొన్నారు.